
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం ၊ 19 ၊ అక్టోబర్ ၊ 2024



33,891 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి 33,891 క్యూసెక్కుల వరద వస్తోంది. శుక్రవారానికి 57.036 టీఎంసీలకు చేరుకుంది. పెన్నార్‌డెల్టాకు 50, ఉత్తరకాలువకు 40, కండలేరుకు 10 వేలు, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.79,840
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,234
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,451
నవర (8 గ్రాములు)	రూ.59,608

గరిష్టం/కనిష్టం
34.1 /26.4

వాతావరణం

జిల్లాలో వాతావరణం శనివారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం గాలిలో తేమ 74 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ప్రసన్న



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాజీ మంత్రి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిని నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఆయనకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తూ అధికార ప్రతినిధిగా నియమించింది.

విత్తన ప్రాసెసింగ్ యూనిట్లపై విజిలెన్స్ దాడులు



అల్లూరు: మండలంలో అనుమతులు లేకుండా విత్తన ప్రాసెసింగ్ చేసి విక్రయాలు చేస్తున్న పలు యూనిట్లపై విజిలెన్స్ ఎస్పీ రాజేంద్రకుమార్ శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. మండలంలోని బీరంగుంట, అల్లూరు, అల్లూరు పేటలోని మూడు విత్తన ప్రాసెసింగ్ యూనిట్లను అనుమతి లేకుండా నిర్వహిస్తూ, విత్తనాలను అమ్ముతున్నట్లు సమాచారంతో తనిఖీలు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వీరిపై చట్టపరమైన చర్యలను తీసుకుంటామన్నారు. లైసెన్సులు లేకుండా విత్తనాలను అమ్మినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ వెంట విజిలెన్స్ ఏఓ వేణుగోపాల్, ఏడీఏ నాగరాజు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు నరసాపురం విద్యార్థి



ఇందుకూరుపేట: బాపట్లలో నవంబర్ తొమ్మిది నుంచి 11 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ముక్కంటి శ్రీతేజ ఎంపికైందని హెచ్‌ఎం నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 కబడ్డీ పోటీల్లో శ్రీతేజ ఉత్తమ ప్రతిభకనబర్చి నరసాపురం జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించడంలో తనవంతు పాత్రను పోషించిందని చెప్పారు. విద్యార్థితో పాటు పీఈటీ ముజీర్‌ను అభినందించారు.

ఈఓ వ్యవహారంపై బహిరంగ విచారణ నేడు

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు సూరపనేని శ్రీనివాసులు, గంగపట్ల సనమ్మ తన విధులకు ఆటంకం కలిగించారంటూ ఇటీవల ఈఓ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన కొత్త మలుపు తిరిగింది. అయితే పంచాయతీ కార్యాలయంలో మాజీ సీఎంలు వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాల తొలగింపుపై అభ్యంతరం వ్యక్తం చేసినందుకు తమపై తప్పుడు కేసులు పెట్టారంటూ వార్డు సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ శనివారం ఉదయం 11 గంటలకు బహిరంగ విచారణ చేపట్టనున్నారు. వార్డు సభ్యులు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది సమక్షంలో విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు పంపించనున్నారు.

తెల్ల ఖనిజం దోపిడీ నిజం

మైనింగ్ అనుమతులు లేకుండా తవ్వకాలు

- హైదరాబాద్, చెన్నైకు నిత్యం 500 టన్నుల తరలింపు
- రైల్వేకోడూరు పర్మిట్లతో ఇక్కడి నుంచి అక్రమ రవాణా
- మామూళ్ల మత్తులో జోగుతున్న మైనింగ్ శాఖ

అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతల సహజ వనరుల దోపిడీ దండయాత్ర అప్రతిహతంగా కొనసాగుతోంది. పచ్చనేతలు చీకటి దోపిడీకి కాదేదీ అనర్హం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఇసుక, మట్టి, గ్రావెల్ కొల్లగొడుతున్న తమ్ముళ్లు.. తాజాగా మూసేసిన తెల్ల ఖనిజం మైన్స్‌లో అక్రమ తవ్వకాలతో చెలరేగిపోతున్నారు. అడ్డదారుల్లో అక్రమ రవాణా చేసి పక్క రాష్ట్రాలు, జిల్లాల పర్మిట్లతో సరిహద్దులు దాటిస్తున్నారు. చీకటి దోపిడీని అడ్డుకోవాల్సిన మైనింగ్ శాఖ మామూళ్ల మత్తులో జోగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని సైదాపురం మండలంలో దొరికే విలువైన క్వార్ట్జ్ (తెల్లరాయి) ఖనిజానికి దేశీయంగానే కాకుండా విదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. విలువైన ఖనిజ సంపదను టీడీపీ నేతలు కొల్లగొడుతున్నారు. గత కొంత కాలంగా మైనింగ్ అనుమతులు నిలిపివేసి మూసేసిన గనుల్లో తెల్ల ఖనిజాన్ని అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. చీకటి పడితే చాలు ఖనిజాన్ని లారీలు, టిప్పర్లతో హైదరాబాద్, చెన్నై ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. స్థానికంగా తెల్లరాయి మైనింగ్‌కు అనుమతి లేకపోవడంతో శ్రీసత్యసాయి జిల్లాలోని రైల్వేకోడూరు, హైదరాబాద్ పర్మిట్లతో రవాణా చేస్తున్నా.. మైనింగ్ శాఖాధికారులు మామూళ్లు దండుకుంటూ ముఖం చాటేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గనులు, యార్డులు మూసివేత

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా వెంకటగిరి, సర్వేపల్లి, ఉదయగిరి నియోజకవర్గాల్లో క్వార్ట్జ్ (తెల్లరాయి) ఖనిజం దొరుకుతోంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా ప్రాంతాల్లో ఇచ్చిన అనుమతులను రద్దు చేసింది. దీంతో తెల్లరాయి గనులతో పాటు వీటికి సంబంధించి యార్డులను సైతం మూసివేసింది. కొద్ది రోజులు స్తబ్దుగా ఉన్న టీడీపీ నేతలు ఆ తర్వాత నుంచి తెల్లరాయి చీకటి దోపిడీకి తెరతీశారు. ముఖ్యంగా సైదాపురం మండలంలో దొరికే క్వార్ట్జ్, పల్స్‌ఫర్ ఖనిజాలకు దేశీయంగానే కాకుండా విదేశాల్లో కూడా మంచి గిరాకీ ఉంది. వర్ ముఖ్‌లైట్‌కు దేశీయంగా డిమాండ్ ఉంది. గత ప్రభుత్వం ఖనిజాల తవ్వకాలకు పారదర్శకంగా అనుమతులు మంజూరు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతోనే ఆయా గనులకు అనుమతి కాలం ఉన్నప్పటికీ రద్దు చేసి జిల్లాలో ఉన్న అన్ని గనులను మూసివేసింది. అయితే అప్పటి నుంచి గనుల్లో తవ్వకాలకు అధికారికంగా అనుమతి ఇవ్వలేదు. ఒక అమృతేష్ మైకా మైన్‌కు మాత్రమే అనుమతి ఉంది. ఈ మైన్ నుంచి కూడా కేవలం ఫల్స్‌ఫర్ ఖనిజాన్ని టైల్స్ ఫ్యాక్టరీకి తరలించేందుకు అనుమతులు మంజూరు చేసింది. అయితే టీడీపీ నేతలు అనధికారికంగా గనుల్లో తవ్వకాలు చేపట్టి హైదరాబాద్, రైల్వేకోడూరు అనుమతులతో తరలించేస్తున్నారు. జిల్లాలో సుమారు 250కి పైగానే యార్డులు ఉండగా ఈ యార్డులను కూడా కూటమి ప్రభుత్వం మూసేసింది. కానీ కొందరు యార్డు యజమానులు కూటమి నేతల అండదండలతో యథేచ్ఛగా పనులు చేస్తున్నారు. ఆయా యార్డుల నుంచి ఖనిజాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారు.

అక్రమ రవాణాపై అధికారుల మౌనం

పగలంతా అక్రమంగా క్వార్ట్జ్ తవ్వకాలు చేపడుతున్నారు. చీకటి పడ్డాక టిప్పర్లు, టర్బో లారీల్లో సైదాపురం – పొదలకూరు వయా వీరంపల్లి మీదుగా హైవే ఎక్కించి హైదరాబాద్, చెన్నై ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొందరైతే సైదాపురం వయా గూడూరు మీదుగా బైపాస్‌లో యార్డులకు తోలి అక్కడి నుంచి చెన్నైకు రవాణా చేస్తున్నారు. స్థానికంగా అధికారికంగా మైనింగ్ అనుమతులు లేకపోవడంతో హైదరాబాద్, రైల్వేకోడూరు పర్మిట్లతో అక్రమ రవాణా చేస్తున్నారు. అయితే మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులకు భారీగానే అక్రమార్కులు ముడుపులు అందజేస్తున్నట్లు సమాచారం. దీంతో వారు అటు వైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అనధికారికంగా తరలింపునకు సిద్ధం చేసిన ఖనిజం

రోజూ 500 టన్నుల ఖనిజం తరలింపు?

సైదాపురం మండలం నుంచి ప్రతి రోజు 500 టన్నుల క్వార్ట్జ్, పల్స్‌ఫర్, వర్‌ముఖ్‌లైట్ ఖనిజాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలో లభించే క్వార్ట్జ్ ఖనిజం టన్ను రూ.30 వేలు నుంచి రూ.60 వేల వరకు పలుకుతోంది. క్వార్ట్జ్ మైకా టన్ను రూ.25 వేల నుంచి రూ.2 లక్షల వరకు పలుకుతోంది. ఈ లెక్కన దాదాపు అనధికారికంగా రోజుకు రూ.15 కోట్ల విలువైన ఖనిజం అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలిపోతోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ తమ్ముళ్లు జేబులు నింపుకుంటున్నారు. ఇదంతా కూడా వెంకటగిరి షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లోనే సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా తరలిపోయే ఖనిజానికి టన్నుల లెక్కన కప్పం కట్టి తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



సైదాపురం నుంచి రాత్రి వేళ టిప్పర్‌లో తరలిస్తున్న ఖనిజం



లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న లారీ

మద్యం షాపు ఇక్కడొద్దు



షాపు వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న స్థానికులు

- ఇళ్ల పక్కనే షాపుతో ఇబ్బంది పడుతున్న మహిళలు
- నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

బుచ్చిరెడ్డిపాళెం: ఇళ్ల పక్కనే మద్యం షాపు ఏర్పాటు చేయడంతో తామంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని పల్లిపాళెం ప్రజలు శుక్రవారం పెద్ద ఎత్తున దుకాణం ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి షాపును తరలించి మరో ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలంటూ ఎక్సైజ్ అధికారులకు, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. గుడి, బడి, ఆస్పత్రులు ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదనే నిబంధనలను విస్మరించి ఓ టీడీపీ నేత అండతో మద్యం వ్యాపారి జాతీయ రహదారి పక్కనే షాపు ఏర్పాటు చేశారంటూ మండిపడ్డారు. మద్యం దుకాణానికి సమీపంలోనే నారాయణ స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పుత్తూరు కట్టు కట్టే వైద్యశాల ఉన్నాయన్నారు. తమ పిల్లలను స్కూల్, ట్యూషన్లకు వదిలి పెట్టి తీసుకు వచ్చేందుకు తల్లులు ఇదే దారిలో వెళ్లాల్సి ఉందన్నారు. మద్యం షాపు పక్కనే తాగి, తూగి మందుబాబులు చేస్తున్న వీరంగంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మహిళ ఎమ్మెల్యేగా ఉండి.. మహిళలుగా తాము పడుతున్న ఇబ్బందులపై వినతిపత్రం ఇస్తే చూస్తామంటూ చెప్పడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అధికారులకు, రాజకీయ పార్టీల నేతలకు కొంచెం కూడా సంస్కారం ఉందా? అని నిలదీశారు. ఈ షాపుతో పాటు మరో షాపును కూడా జనావాసాల మధ్య ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించినా.. శాసన సభ్యురాలు మౌనం దాల్చుతున్నారన్నారు. స్థానిక ప్రజలు తిరగబడడంతో ఒక షాపును మాత్రం మూసి వేశారని, ఇక్కడ మాత్రం షాపును కొనసాగించేందుకే ఆ టీడీపీ నేత ఎమ్మెల్యేపై, అధికారులపై ఒత్తిడి తెస్తున్నారంటూ మండిపడ్డారు. షాపును ఇక్కడి నుంచి తరలించే వరకు ఊరుకోమని హెచ్చరించారు. స్థానికులు దుకాణం ఎదుట నిరసన వ్యక్తం చేస్తుంటే.. మరో వైపు అక్కడే ఫుల్లుగా తాగి ఓ వ్యక్తి పడిపోవడం, మరో వైపు ఇంకో వ్యక్తి తాగుతుండడం చూసి స్థానికులు ఇలాంటి పరిస్థితులు జనావాసాలు మధ్య జరుగుతున్నాయంటూ విచారం వ్యక్తం చేశారు.



ఇళ్ల మధ్యలో ఉన్న షాపు పక్కనే నిలబడి మద్యం తాగుతున్న వ్యక్తి



షాపు ముందు తాగి పడిపోయిన వ్యక్తి

చీకట్లో పెద్దాస్పత్రి ఓపీ బ్లాక్

నెల్లూరు (అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లోని ఓపీ బ్లాక్ గురువారం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయి చీకట్లో మగ్గుతోంది. శుక్రవారం నాటికి కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు. ఓపీ బ్లాక్ పాత భవనం కావడంతో గోడల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు, స్విచ్‌లు దెబ్బతిని సక్రమంగా లేవు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ భవన గోడలు చెమ్మగిల్లి షాక్ కొడుతున్నాయి. ఓపీ బ్లాక్‌లోని విద్యుత్ బోర్డు ప్యానెల్ నెమ్ముతో చేరిపోయింది. 11వ నంబర్‌లో ఉన్న ముగ్గురు డాక్టర్ల ఓపీలు, న్యూరాలజీ ఓపీ, ఓపీ చీటీలు ఇచ్చే గది, ఇంజక్షన్ వేసే గది, మందులు ఇచ్చే గది, సదరమ్ క్యాంపు గది, క్యారిడార్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేశారు. దీంతో కనీసం బల్బులు కూడా వెలిగే పరిస్థితి లేకుండా పోయింది. కిటికీలు ఓపెన్ చేసి సూర్య కాంతిలోనే రోగులకు డాక్టర్లు వైద్య సేవలందిస్తున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌ను వివరణ కోరగా త్వరితగతిన మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు.



విద్యుత్ సరఫరా లేకపోవడంతో సూర్యకాంతిలోనే వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు

మళ్లీ టమాటా ధరలకు రెక్కలు

- వర్షం బూచితో రూ.100కు చేరువ
- ఇతర కూరగాయలు కూడా అదే రీతి

నెల్లూరు (సెంట్రల్): నెల్లూరులోని హోల్ సేల్ కూరగాయల మార్కెట్లో మళ్లీ టమాటా ధరలకు రెక్కలొచ్చాయి. మార్కెట్లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి వర్షం బూచి చూపించి కూరగాయలపై ఇష్టానుసారంగా రేట్లు పెంచుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా మార్కెటింగ్ శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడం, అధికార పార్టీ నాయకుల అండదండలతో అడ్డూ అదుపు లేకుండా వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల టమాటా కిలో రూ.100లకు వరకు పెంచి విక్రయాలు చేపట్టారు. కూరగాయల ధరలపై సర్వత్రా ప్రజల్లో వ్యతిరేకత పెల్లుబికడంతో జిల్లా అధికారులు సబ్సిడీ ధరలతో కిలో రూ.50లకే విక్రయాలు ప్రారంభించారు. దీంతో వ్యాపారులు ఒక్క రోజులోనే కిలో రూ.50లకు తగ్గించారు. సబ్సిడీపై సరఫరాను అధికారులు నిలిపివేయడంతో మళ్లీ వ్యాపారులు ధరలు పెంచేశారు. తాజాగా కిలో టమాటా రూ.100లకు చేరడం గమనార్హం. వంకాయలు కూడా కిలో రూ.80, బీన్స్ కిలో రూ.120కి పైగా, పందిరి చిక్కుళ్లు రూ.90 పైగా ఉంది.



ట్రూఅప్ పేరుతో విద్యుత్ చార్జీల భారం

- ప్రజల నుంచి రూ.20 వేల కోట్లు దండుకునే యత్నం
- చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు
- గతంలో ఇలాంటి నిర్ణయంతోనే గద్దె దిగిన చంద్రబాబు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో గడిచిన రెండేళ్లకు సంబంధించి దాదాపు రూ.20 వేల కోట్లు ప్రజలపై మోపేందుకు సిద్ధమైందని సీపీఎం నేతలు ఆరోపించారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు ప్రజలపై పెనుభారం మోపుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ శుక్రవారం విద్యుత్‌భవన్ వద్ద ధర్నా చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, నెల్లూరురూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీల పేరుతో 2022-23 సంవత్సరానికి రూ.8,114 కోట్లు, 2023-24 సంవత్సరానికి రూ.11 వేల కోట్లు వసూలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఎన్నికల సమయంలో తాను అధికారంలో వస్తే విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పిన చంద్రబాబు నేడు రూ.వేల కోట్లు విద్యుత్ చార్జీల రూపంలో పెంచేందుకు సిద్ధం కావడం విచారకరమన్నారు. 2000వ సంవత్సరంలో పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో నిరసన తెలిపిన వారిపై గుర్రాలతో తొక్కించి కాల్పులు చేసిన ఘటనలతో చంద్రబాబు గద్దె దిగారన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ, గృహ విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ విజయన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ అజీజ్, ప్రసాద్, కిన్నెరకుమార్, సతీష్, సంపత్‌కుమార్, శ్రీనివాసులు, మాలకొండయ్య, సుధాకర్, బాబు, ఖలీల్, షాహినాబేగం తదితరులు, పాల్గొన్నారు.



విద్యుత్‌భవన్ వద్ద నిరసన ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

టీడీపీ నేత ఇల్లే పేకాట క్లబ్

- నిత్యం రూ.లక్షల్లో లావాదేవీలు
- పోలీసుల దాడులు.. త్రుటిలో తప్పించుకున్న నేతలు
- పోలీసులే ఉప్పందించారని ఆరోపణలు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని కొడవలూరు మండలం నార్తురాజుపాళెంకు చెందిన దివ్యాంగుడైన ఓ టీడీపీ నేత తన ఇంటినే ఏకంగా పేకాట క్లబ్‌గా మార్చేశాడు. కొద్ది రోజులుగా సదరు నేత స్థానిక టీడీపీ నేతలతో పాటు యల్లాయపాళెం, గండవరం తదితర గ్రామాలకు చెందిన పేకటరాయళ్లకు ఆశ్రయం కల్పించి పేకాట ఆడిస్తున్నట్లు సమాచారం. దీంతో మూడ్రోజుల క్రితం స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దాడి చేస్తారన్న సమాచారం తెలుసుకున్న పేకాటరాయుళ్లు పట్టుబడకుండా తప్పించుకున్నారు. నిర్వాహకుడు దివ్యాంగుడు కావడంతో పరుగులు తీసే పరిస్థితి లేక ఆయన్ను పశువుల కొట్టంలో పెట్టి తాళం వేశారని తెలిసింది. పోలీసులు దాడి చేయబోతున్న విషయం ముందుగానే ఉప్పందడంతో స్థావరం నుంచి పేకాట రాయుళ్లంతా పరారయ్యారని సమాచారం. పోలీసులు దాడి చేయడానికి ముందు స్థావరంలో గ్రామానికి చెందిన నిర్వాహకుడి అనుచరులంతా ఉండడంతో పాటు యల్లాయపాళెంకు చెందిన ఓ టీడీపీ నేత, ఒక సచివాలయ ఉద్యోగి ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులే ఉప్పందించారనే ఆరోపణలు లేకపోలేదు.

గతంలోనూ పట్టుబడిన నాయకులు

నార్తురాజుపాళెంలోని ఆ నాయకుడి ఇంట్లోనే చాలా కాలంగా పేకాట నిర్వహిస్తున్నారు. మూడేళ్ల క్రితం దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అప్పటి ఎస్సై సుబ్బారావు నేతృత్వంలో దాడి చేసి నిర్వాహకుడితో సహా పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై అప్పటి నుంచి పోలీసుల నిఘా ఉండడంతో కొంత కాలంగా పేకాటకు విరామం ఇచ్చారు. ఇటీవల యథావిధిగా నిర్వహణ ఆరంభించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. పేకాట నిత్యం రూ.లక్షల్లో జరుగుతోందని తెలుస్తోంది. రాత్రి, పగలు తేడా లేకుండా అక్కడ పేకాట నిర్వహిస్తున్నారు. కొందరు అక్కడే మద్యం తాగుతూ చేస్తున్న రచ్చతో చుట్టు పక్కల నివాసాల వారికి ఇబ్బందికరంగా మారింది. అక్కడ భారీ ఎత్తున పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో పోలీసులు పూర్తిస్థాయిలో పేకాటను నియంత్రిస్తారా? లేక చూసీచూడనట్లు వదిలేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

శాప్ చైర్మన్ రాక నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాప్) చైర్మన్ రవికుమార్ జిల్లాలో శనివారం పర్యటించనున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని మొగళ్లపాళెంలో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియాన్ని ఉదయం 11 గంటలకు పరిశీలించాక నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయ సిబ్బందితో సమావేశమవ్వనున్నారు. అనంతరం తిరుపతి వెళ్లనున్నారు.

పొగాకు రైతుకు లాభాల పంట

ఇప్పటికే రెండో కేంద్రంలో ముగిసిన పొగాకు వేలం

- ఒకటో కేంద్రంలో మరో రెండు, మూడు రోజుల్లో ముగింపు
- ఈ ఏడాది మార్కెట్‌లో కేజీకి రికార్డు ధర
- వచ్చే సీజన్‌లో పెద్దఎత్తున సాగుకు సిద్ధమవుతున్న రైతులు

పూర్తి లాభాలతో ఈ ఏడాది పొగాకు మార్కెట్ ముగింపునకు చేరుకుంది. కందుకూరులోని రెండు వేలం కేంద్రాల్లో ఇప్పటికే ఒక దాంట్లో వేలం ప్రక్రియ పూర్తయింది. మరో కేంద్రంలో రెండు, మూడు రోజుల్లో ముగియనుంది. దాదాపు ఏడు నెలలపాటు సాగిన ప్రక్రియ ఈ ఏడాది రైతులకు ఊహించని లాభాలు తెచ్చిపెట్టింది. కేజీ పొగాకుకు రికార్డు ధర వచ్చింది. దీంతో రాబోయే సీజన్‌కు రైతులు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు.


పొగాకు పంట

కందుకూరు: రెండు సంవత్సరాల నుంచి పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉంది. దీంతో అధికారుల అంచనాలను మించి రైతులు పండిస్తున్నారు. కందుకూరులోని రెండు వేలం కేంద్రాల్లో ఈ ఏడాది అమ్మిన పొగాకు ఉత్పత్తే ఇందుకు నిదర్శనం. 2023-24 పంట సీజన్‌కు సంబంధించి ఒకటో కేంద్రం పరిధిలో 8.8 మిలియన్ కేజీలు, రెండో దాని పరిధిలో 7.8 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తులను అమ్ముకునేందుకు బోర్డు అనుమతి ఉంది. అయితే ఒకటో కేంద్రంలో ఇప్పటికే 16.3 మిలియన్ కేజీలను, రెండో కేంద్రంలో 13.7 మిలియన్ కేజీలను విక్రయించారు. దీంతోపాటు పొగాకు చూర, ముక్కను కూడా భారీగానే అమ్ముకున్నారు. దీనినిబట్టి చూస్తే అధికారుల అంచనాలను మించి పొగాకు పంటను రైతులు పండిస్తున్నారు.

రికార్డు ధర

ఈ సంవత్సరం మార్కెట్‌లో కిలో పొగాకు రికార్డు ధర పలికింది. అత్యధికంగా రూ.361 వరకు వచ్చింది. నాణ్యమైన పొగాకు క్వింటా రూ.36,100 పలికింది. అదే సరాసరిన కేజీ పొగాకు ఒకటో వేలం కేంద్రంలో రూ.276 పలికితే, రెండులో రూ.270 వరకు వచ్చింది. క్వింటాకు సరాసరి ధర రూ.27 వేలకు పైగానే వచ్చింది. దీంతో రైతులు లాభాలబాట పట్టారు.

మరో సీజన్‌కు రెడీ

ప్రస్తుత సీజన్ అమ్మకాలు ముగియడంతో కొత్త సీజన్‌ను ప్రారంభించారు. పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉండడంతో 2024-25లో భారీగా సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. దీనికి అనుగుణంగానే బోర్డు కూడా బ్యారన్ పరిమితిని కాస్త పెంచింది. గతేడాది ఎస్‌ఎల్‌ఎస్ పరిధిలో బ్యారన్ పరిమితి 36.50 క్వింటాళ్లు ఉంటే.. ఈ సంవత్సరం దానిని 42.75 క్వింటాళ్లకు పెంచింది. అలాగే ఎస్‌బీఎస్ పరిధిలో 35.50 క్వింటాళ్ల నుంచి 41.75 క్వింటాళ్లకు పెరిగింది. రైతుల మధ్య పోటీతో అటు బ్యారన్, పొలం కౌలు ధరలు రెండింతలయ్యాయి. బ్యారన్ కౌలు రూ.3 లక్షల వరకు చెల్లించేందుకు కూడా సిద్ధమయ్యారు. పొలం బాగుంటే ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు కౌలు ఇస్తున్నారు. మరోవైపు మార్కెట్ ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితుల్లో అధికంగా కౌలు పెంచుకోవద్దని బోర్డు అధికారులు హెచ్చరిస్తున్నారు.


సాగులో ఉన్న నారుమడులు

వర్షాలతో ఆందోళన

ఈ సీజన్‌కు సంబంధించి ఇప్పటికే పొగాకు నారుమడులను రైతులు పెద్దఎత్తున సాగు చేశారు. రెండు వేలం కేంద్రాల్లో కలిపి 200 ఎకరాల వరకు సాగయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నారుమడులు దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటి వరకు కురిసిన వానలతో ఎటువంటి నష్టం లేకపోయినా మరో రెండు, మూడు రోజులు ఇవే వర్షాలు కొనసాగితే మాత్రం ఇబ్బందులు తప్పవని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు నారుమడుల్లో నీరు నిలబడకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

క్లుప్తంగా

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన


పత్రాలను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి

నెల్లూరు(టౌన్): జిల్లాలోని పది కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 31 బోధనా పోస్టులకు 498 మంది దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం నెల్లూరులోని సమగ్రశిక్ష కార్యాలయం సమావేశ మందిరంలో అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. శనివారం కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని ఏపీసీ ఉషారాణి తెలిపారు. సీఆర్టీలు – 7, పీజీటీలు – 16, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ – 7, అకౌంటెంట్ – 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం వారికి వచ్చిన మార్కులు, రోస్టర్ కమ్ రిజర్వేషన్ ఆధారంగా మెరిట్ జాబితాను సమగ్రశిక్ష అధికారులు తయారు చేయనున్నారు. దీనిని కలెక్టర్ ఆనంద్‌కు పంపించి అప్రూవల్ పొందిన తర్వాత రాష్ట్ర సమగ్రశిక్ష అధికారులకు పంపుతారు. వారు ఓకే చేశాక కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులకు పోస్టులు కేటాయించనున్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

- ఎస్పీ కృష్ణకాంత్


సమస్యలు వింటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ డీపీఓ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. నెల్లూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహించారు. బదిలీలు, ఆరోగ్య సమస్యలు, సస్పెన్షన్లు తొలగించాలని 19 మంది తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని విన్న కృష్ణకాంత్ తగిన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. సిబ్బంది సంక్షేమంలో భాగంగా ప్రతి శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న మరో కారు

- తప్పిన ఘోర ప్రమాదం


ఘటనా స్థలంలో కారు

పొదలకూరు: ఆగి ఉన్న కారును మరో కారు ఢీకొట్టిన ఘటన శుక్రవారం పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ధాబా వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. నెల్లూరు నుంచి ఐదుగురు వ్యక్తులు స్విఫ్ట్ కారులో పెంచలకోనకు వెళ్తున్నారు. కలువాయికి చెందిన వారు పట్టణానికి సమీపంలో నెల్లూరు మార్గం లేఅవుట్లలో ప్లాట్లు చూసేందుకు కారులో వచ్చారు. రోడ్డు పక్కన వాహనాన్ని ఆపారు. ఈ క్రమంలో పెంచలకోనకు వేగంగా వస్తున్న కారు ఆగి ఉన్న కారును మొదట ఢీకొంది. తర్వాత పక్కనే ఉన్న మోటార్‌బైక్‌ను కూడా ఢీకొట్టింది. ఆఖరికి తాటిచెట్టును ఢీకొని ఆగిపోయింది. అందులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. ప్రమాదానికి గురైన కారులోని వారి వివరాలు తెలియాల్సి ఉంది.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఉలవపాడు: రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన ఉలవపాడు – సింగరాయకొండ మధ్య చిల్ల కాల్వ బ్రిడ్జిపై శుక్రవారం జరిగింది. వివరాలు.. గూడూరు నుంచి విజయవాడ వెళ్లే లైన్‌పై మృతదేహాన్ని సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి శరీరంపై డ్రాయర్ మాత్రమే ఉంది. వయసు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఒంగోలు రైల్వే వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 140
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 276
లేయర్ చికెన్	: 195



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.55
పండ్లు	: రూ.30



రైల్వే బ్రిడ్జిని పొడిగించాలని కలెక్టర్‌కు వినతి


రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

ఆత్మకూరురూరల్: 'నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం వద్ద పెన్నానదిపై రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ఆ శాఖ ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే అర కిలోమీటరు దూరంపైగా ఉన్న బొగ్గేరు వరకు దీనిని పొడిగించాలి' అని రైతులు కలెక్టర్ ఒ.ఆనంద్‌కు విజ్ఞప్తి చేశారు. మండలంలోని అప్పారావుపాళెంలో రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించిన భూములు కోల్పోతున్న రైతులతో శుక్రవారం ఆయన ముఖాముఖి మాట్లాడారు. తమ గ్రామంలో ఒక్కో ఎకరం సగటున ధర రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలుగా ఉందని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. బొగ్గేరు – పెన్నానది మధ్యన 8 మీటర్ల ఎత్తులో మట్టికట్టపై రైల్వేలైన్ ఏర్పాటు చేస్తే వరదలు వచ్చినప్పుడు తమ గ్రామం మునిగిపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, తహసీల్దార్ సుధీర్, ఉద్యాన శాఖాధికారి రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడి..

చేజర్ల: మండలంలోని పెరుమాళ్లపాడు రెవెన్యూ పరిధి చలపనాయుడుపల్లి గ్రామంలో కలెక్టర్ ఆనంద్ శుక్రవారం పర్యటించారు. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వేలైన్‌కు సంబంధించి భూసేకరణలో భాగంగా నష్ట పరిహారానికి సంబంధించిన రైతులతో మాట్లాడారు. రేట్ల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ ధరల ప్రకారం ఎకరాకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వస్తుందన్నారు. రైతులు తమకు రూ.10 లక్షల నష్ట పరిహారం కావాలని అడిగారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మస్తానయ్య, ఎంపీడీఓ విజయలలిత పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం


లక్ష్మీనారాయణ మృతదేహం

కందుకూరు రూరల్: అతి వేగంగా వెళ్తున్న ఆటో బోల్తా పడి ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని దొండపాడు సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పాలూరు గ్రామానికి చెందిన ఆటో ప్రయాణికులతో కందుకూరుకు వస్తోంది. దొండపాడు గ్రామం దాటగానే సామగ్రితో వెళ్తున్న మరో ఆటోను క్రాస్ చేసేందుకు డ్రైవర్ వేగంగా నడిపాడు. దీంతో అదుపుతప్పిన ఆటో బోల్తా పడింది. అందులో ఉన్న పాలూరుకు చెందిన మార్తాటి లక్ష్మీనారాయణ అలియాస్ దామోదర్ (65) తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించిన రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఒంటరైన కుమారుడు

లక్ష్మీనారాయణ గ్రామంలో ఉన్న వీధి నాటకాల బృందంతో వెళ్తుంటాడు. లేకలేక కుమారుడు పుట్టగా ముత్యాలయ్య అని పెట్టాడు. అతని చిన్నతనంలోనే తల్లి అనారోగ్యంతో మరణించింది. అప్పటి నుంచి లక్ష్మీనారాయణ కుమారుడి ఆలనాపాలన చూసుకుంటూ చదివించాడు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన ముత్యాలయ్య ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. లక్ష్మీనారాయణకు వచ్చే పింఛన్, నాటకాల ద్వారా వచ్చే డబ్బులతోనే కుటుంబం నడుస్తోంది. రోడ్డు ప్రమాదంలో అతను మరణించడంతో ముత్యాలయ్య ఒంటరివాడయ్యాడు.

మద్యం షాపు ఏర్పాటుకు అనుమతివ్వొద్దు

- మహిళల ఆందోళన


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న విజయ డెయిరీ ప్రాంతవాసులు

నెల్లూరు(క్రైమ్): తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి ఇవ్వొదంటూ నెల్లూరు వెంకటేశ్వరపురం విజయ డెయిరీ ప్రాంత స్థానికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఆ ప్రాంతానికి వచ్చిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులునాయుడు, ఏఈఎస్ రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ విజయ డెయిరీ ప్రాంతంలో తాము ఎన్నో సంవత్సరాలుగా జీవిస్తున్నామన్నారు. ఎంతోమంది మహిళలు డెయిరీలో పనిచేస్తున్నారని తెలిపారు. స్థానికులు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పాల కోసం డెయిరీకి వెళ్తారన్నారు. దానికి సమీపంలోనే స్కూల్, మసీదు ఉన్నట్లు ఏఈఎస్‌కు చెప్పారు. ఈ నేపథ్యంలో మద్యం దుకాణం ఏర్పాటుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారన్నారు. దుకాణం ఏర్పాటైతే ఇక్కడ శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడే ప్రమాదముందన్నారు. ఎక్సైజ్ అధికారులు అనుమతులు మంజూరు చేయొద్దని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిపాడు: మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2025 – 26 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8, 10 తరగతుల విద్యార్థులు అర్హులని, ఈనెల 30 చివరి తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేసిన వారికి పురస్కారాలు

నెల్లూరు(బృందావనం): కేంద్ర మాజీ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 11వ తేదీన మైనార్టీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్య విభిన్న విభాగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి పురస్కారాలను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ పురస్కారం, డాక్టర్ అబ్దుల్ హక్ ప్రాంతీయ స్థాయి పురస్కారాలను అందించనున్నారన్నారు. ప్రోత్సాహకంగా రూ.1.25 లక్షలు, సర్టిఫికెట్, జ్ఞాపిక, అలాగే ప్రాంతీయ స్థాయి పురస్కారానికి రూ.లక్ష ప్రోత్సాహకం, సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేస్తారన్నారు. అలాగే రాష్ట్రానికి చెందిన ఉర్దూ సాహితీవేత్తలు, కవులు, పాత్రికేయులు, విమర్శ పరిశోధన, ఉర్దూ సేవకులు తదితరులు ఆరుగురికి జీవిత సాఫల్య పురస్కారాలు అందించనున్నట్లు వివరించారు. ఉర్దూ భాషాభివృద్ధికి తమ వంతు కృషిచేస్తున్న టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, ఉర్దూ భాషలో అత్యున్నత శ్రేణిలో రాణించిన విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి పురస్కారం ఇస్తారన్నారు. ఉర్దూ అకాడమీ ద్వారా జారీ చేసిన దరఖాస్తు ఫారం పూర్తిచేసి అందుకు సంబంధించిన ప్రమాణప్రతులను జత పరిచి ఈనెల 25వ తేదీలోగా మహమ్మద్ మస్తాన్, డైరెక్టర్/సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ, డోర్ నంబర్ 76-1-6ఏ/1-2, మాళవిక విల్లా, హెచ్‌బీ కాలనీ, భవానీపురం, విజయవాడ-520 012 చిరునామాకు పోస్టు, కొరియర్ ద్వారా పంపాలని కోరారు.

బంగారం షాపులో చోరీకి యత్నం

- కేకలు వేయడంతో దొంగల పరార్


జాకీ, గునపాన్ని షాపు వద్ద వదిలి వెళ్లిన దొంగలు

పొదలకూరు: పట్టణంలోని మెయిన్ బజార్‌లోని పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో బంగారం షాపులో గురువారం అర్ధరాత్రి చోరీ యత్నం జరిగింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. సన్నికంటి రాధయ్య అనే వ్యక్తి చాలా సంవత్సరాలుగా మెయిన్ బజార్లో బంగారం షాపును నిర్వహిస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి గునపం, జాకీని ఉపయోగించి దుకాణం షట్టర్‌ను తెరుస్తుండగా ఎదురుగా మిద్దెపై నుంచి ఓ యువకుడు చూసి కేకలు వేశాడు. దీంతో దొంగలు జాకీ, గునపం అక్కడే వదిలేసి పరారయ్యారు. గతంలో సినిమా హాలుకు సమీపంలో మెయిన్ బజారులోనే ఇదే తరహాలో పెయింటింగ్స్ దుకాణం షట్టర్ తెరిచి కొంత నగదును అపహరించారు. వారే చోరీకి ప్రయత్నించి ఉండొచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సీఐ రాంబాబు, ఎస్సై హనీఫ్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ నిర్వహించారు. శుక్రవారం ఉదయం క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. దగ్గరలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీను పరిశీలిస్తున్నారు. మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న దుకాణం షట్టర్ తెరిచే ప్రయత్నం జరగడంతో బంగారు దుకాణాల వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు.

హెర్బాలైఫ్ కంపెనీకి జరిమానా


జింకారెడ్డి శేఖర్, న్యాయమూర్తి

నెల్లూరు(దర్గామిట్ట): బరువు పెరుగుతారని నమ్మించి మోసం చేసిన హెర్బాలైఫ్ కంపెనీకి శుక్రవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి జింకారెడ్డి శేఖర్ జరిమానా విధించారు. తప్పుడు ప్రకటనలు, వాగ్దానాలతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడొద్దంటూ హెచ్చరించారు. ఆయన కథనం మేరకు.. కావలి పట్టణానికి చెందిన ఉప్పు వినయ్‌కుమార్ అనే వ్యక్తి బరువు పెరిగేందుకు హెర్బా లైఫ్‌కు చెందిన పదార్థాలను రూ.8,131.96లకు కొనుగోలు చేశాడు. అవి వాడిన తర్వాత బరువు పెరగకపోగా తగ్గిపోవడంతో కంపెనీని సంప్రదించాడు. వారు మళ్లీ వేరే రకం పదార్థాన్ని రూ.924.82లు వసూలు చేసి ఇచ్చారు. అయినా ఫలితం లేకపోవడంతో వినయ్‌కుమార్ నెల్లూరులోని వినియోగదారుల కోర్టును ఆశ్రయించాడు. కేసును విచారించిన న్యాయమూర్తి జింకారెడ్డి శేఖర్ బాధితుడికి రూ.29,056.78లు (బాధితుడి వద్ద నుంచి వసూలు చేసిన నగదు, మానసిక ఆవేదనకు గానూ రూ.15 వేలు, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు) తీర్పు వెలువడిన 45 రోజుల్లోగా చెల్లించాలని హెర్బాలైఫ్ కంపెనీని ఆదేశించారు. తీర్పు ఇచ్చిన వారిలో సభ్యురాలు బాలసుధ ఉన్నారు.

అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ తనిఖీలు


లైసెన్స్‌లను పరిశీలిస్తున్న నీరజ

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులోని పలు చిల్లర దుకాణాలను నెల్లూరు డివిజన్ అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ నీరజ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరుకులను పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. లైసెన్స్ లేని దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొనుగోలుదారులు వస్తువుల తయారు తేదీ, గడువు తేదీ, నిర్ణీత ధరను సరి చూసుకోవాలన్నారు. బిల్లును తప్పనిసరిగా పొందాలన్నారు. వ్యాపారస్తులు నిబంధనలు పాటించాలన్నారు. గడువు మీరిన, నాణ్యత లేని వస్తువులను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే దుకాణాల లైసెన్సులు పరిశీలించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తున్నారని సమాచారం తెలియడంతో పలువురు షాపులను మూసివేశారు.

సీఎండీ అభినందనలు


మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా విద్యుత్ శాఖ సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకుని కష్టపడి పనిచేయడంపై ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు అభినందనలు తెలిపారని జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ వెల్లడించారు. విద్యుత్ భవన్‌లో శుక్రవారం ఆయన జిల్లాలోని ఈఈలు, డీఈఈలు, ఏఈలు, అకౌంట్ ఆఫీసర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ 700 మంది సిబ్బందితో టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి డివిజన్‌లో కంట్రోల్ రూమ్‌లు పెట్టామన్నారు. ప్రత్యేక బృందాలను సూళ్లూరుపేటకు పంపామన్నారు. బిల్లుల రీడింగ్‌లను ఐఆర్‌డీఏ ద్వారా స్కానింగ్ చేయాలని, వినియోగదారులు వారి మీటర్లను ఇంటి బయట ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొన్ని డివిజన్లలో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వసూలు చేయాలన్నారు. డీసీ లిస్టులను పక్కాగా అమలు చేయాలని, లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విద్యుత్ ఉద్యోగి బాధ్యతగా పనిచేసి సంస్థకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.